ట్రాఫిక్‌ను పరిశీలించిన ఎస్పీ

పటాన్‌చెరు, సెప్టెంబర్ 25: నియోజక వర్గంలో జాతీయ రహదారిపై, పారిశ్రామి కవాడల్లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను పరిశీలించేందుకు ఎస్పీ చెన్నూరి రూపేశ్ వచ్చారు. బుధవారం మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడ, ఇస్నాపూర్ చౌరస్తాల్లో పటాన్‌చెరు, బీరంగూడ చౌరస్తాల్లో డ్రోన్ వ్యూ ద్వారా ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఉదయం, సాయంత్రం, స్కూల్, కళాశాలల వేళ, పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులను తరలించే బస్సుల టైమింగ్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ జాంకు గల కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న చోట స్పెషల్ ట్రాఫిక్ వాహనాలతో పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్ఎస్ఎస్‌సీ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు లాలునాయక్, ప్రవీణ్‌రెడ్డి, స్వామిగౌడ్ ఉన్నారు.

పోచమ్మ బస్తీ సమస్యలు పరిష్కరించాలి

బొల్లారం, సెప్టెంబర్ 25: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు పోచమ్మ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను యువజన నాయకుడు ఎండీ ఇమ్రాన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని గాంధీభవన్లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు మంత్రి దామోదరను కలిసి బస్తీలో రోడ్లు, మిషన్ భగీరథ తదితర సమస్యలపై వివరించారు. స్పందించిన మంత్రి కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

కార్మికులకు శానిటేషన్ కిట్లు పంపిణీ

కంది, సెప్టెంబర్ 25: గ్రామాలను శుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీవో అనిత పంచాయతీ కార్మికులకు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం కంది మండలం ఎద్దుమైలారంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం పంచాయతీ కార్మికులకు నిర్వహించిన హెల్త్ క్యాంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల పంచాయతీ కార్మికులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కంది పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొని పంచాయతీ కార్మికులకు నిర్వహించిన హెల్త్‌క్యాంప్‌ను పరిశీలించారు. ఎంపీఓ మహేందర్‌రెడ్డి, ఎద్దుమైలారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వైద్యాధికారి సాయిశంకర్ పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో కూల్చివేతలు

అమీన్‌పూర్ సెప్టెంబర్ 25: మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 1056లో నవ్య నగర్ రహదారి పక్కన ఉన్న అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు బుధవారం కూల్చివేశారు. సర్వే నంబరులో ఓ వ్యక్తి 200 గజాల్లో అనుమతులు లేకుండా అదనంగా రెండంతస్తులు వేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ ఆధ్వర్యంలో రెండంతస్తులను కూల్చివేశారు.

అక్రమ వెంచర్లలో నిర్మాణాలు అరికట్టాలి

అందోల్, సెప్టెంబర్ 25: అందోల్–జోగిపేట మున్సిపలిటీ పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు దళిత సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మధుకర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని, వెంటనే వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున్న ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దళిత సంఘాల నాయకులు మొగులయ్య, రాజు, నర్సింలు, పండగోపాల్ పాల్గొన్నారు.

సందడిగా వాలీబాల్ పోటీలు

రామచంద్రాపురం, సెప్టెంబర్ 25: భెల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. డీఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అమూల్యమ్మ నేతృత్వంలో క్రీడా పోటీలు జరుగుతున్నాయి. అండర్ 14విభాగంలో 28 టీమ్‌లు, అండర్ 17విభాగంలో 28టీమ్‌లు పాల్గొన్నాయి. అండర్ 14 విభాగంలో మునిపల్లి మండలం మొదటిస్థానంలో నిలువగా, రెండో స్థానంలో నారాయణఖేడ్ మండలం నిలిచింది. అండర్ 17విభాగంలో హత్నూర మొదటిస్థానంలో నిలువగా, రెండో స్థానంలో జహీరాబాద్ నిలిచింది. విజేత జట్లకు ఎస్‌జీఎఫ్ సభ్యులు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌసొద్దీన్, మునిపల్లి పీఈటీ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ

ఝరాసంగం, సెప్టెంబర్ 25: మండలంలోని ఎల్గోయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. బుధవారం భవానీ యూత్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా వాలీబాల్ కిట్‌ను అందజేశారు.

డంపింగ్‌యార్డు వద్దని తీర్మానాలు చేశాం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

గుమ్మడిదల, సెప్టెంబర్ 25: మండలంలోని నల్లవల్లి ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీకి సంబంధించిన డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం 2013లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో 152ఎకరాలు ఉన్నదని అధికారులు నివేదికలు ఇచ్చారని, ఈ విషయం కాంగ్రెస్ నాయకులకు తెలియదా అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం గుమ్మడిదలలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు స్థలాన్ని కేటాయిస్తేనే బీఆర్ఎస్ సర్కారు మంజూరు చేసిందన్నారు. అయినా పదేండ్లుగా డంపింగ్ యార్డు ఏర్పాటు కాకుండా ఆపగలిగామన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సూచన మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు డంపింగ్‌యార్డు వద్దని ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి జిల్లా అధికారులకు నివేదించామని తెలిపారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు వద్దని మంత్రి దామోదరకు విన్నవిస్తే సానుకూలంగా స్పందించారని, వంద పడకల దవాఖాన కావాలని కోరితే స్పందించిన మంత్రి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీనిని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక తమ ఉనికి పోతుందోమో బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క వెంకటేశంగౌడ్, మాజీ సర్పంచ్‌లు ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజశేఖర్, మాజీ ఉపసర్పంచ్‌లు మొగులయ్య, తుపాకుల రాజు, రైతు సమన్వయ సంఘం మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వాసుదేవరెడ్డి, ఆంజనేయులు, చక్రపాణి, వినోద్‌గౌడ్, గటాటి రమేశ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మిస్తున్న షెడ్లను జేసీబీతో కూల్చివేయిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి పవన్

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బొల్లారం, సెప్టెంబర్ 25: అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఇటీవల నమస్తే తెలంగాణ దినపత్రికలో 'అక్రమ నిర్మాణాలతో ఆదాయానికి గండి' పేరుతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలకు దిగారు. పారిశ్రామిక వాడలోని సర్వే నంబర్ 81, 84 లలో నిబంధనలకు విరుద్ధంగా ఓ పరిశ్రమలో చేపడుతున్న నిర్మాణాలను జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. లేనియెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ ముఖ్య నవీన్, సిబ్బంది దినేష్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తాం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నిజాంపేట్, సెప్టెంబర్ 25: ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మునిగేపల్లి గ్రామంలో మహాలక్ష్మీ కింద మంజూరైన సబ్సిడీ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకం కింద గ్యాస్ సిలిండర్ రూ. 500కే అందిస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, గృహజ్యోతి కింద 200లోపు యూనిట్లు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. రూ.2 లక్షల పంట రుణమాఫీ చేసినట్లు తెలిపారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగజ్యోతి, ఎంపీడీవో రమేశ్‌బాబు, ఎంపీవో శ్రీనివాస్, నాయకులు మన్నె కృష్ణ, గోలి రాములు, రఘుపతిరెడ్డి, రాధాకిషన్, సంగమేశ్, గంగాధర్, దుర్గాప్రసాద్, రూప పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

మునిపల్లి, సెప్టెంబర్ 25: మండల కేంద్రమైన మునిపల్లిలోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద సీసీ రోడ్డు, సీసీ డ్రైనేజీలు నిర్మించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతికి సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బుధవారం మండల కేంద్రంలో కలెక్టర్ పర్యటించిన సందర్భంగా సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం నుంచి సీసీ రోడ్లు, సరైన సీసీ డ్రైనేజీలు నిర్మాణం చేపటలేదు. ఇండ్ల నిర్మాణంలో నాణ్యత లోపించడంతో భారీ వర్షాలు పడితే బిల్డింగ్ పెచ్చులు ఊడుతున్నాయని పేర్కొన్నారు.

వారసత్వ నియామకాలు చేపట్టాలి

తహసీల్దార్‌కు తిరుమలరావుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

ఝరాసంగం, సెప్టెంబర్ 25: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన జీవో 81, 85 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసత్వ నియామకాలు వెంటనే చేపట్టాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో వీఆర్ఏలు తహసీల్దార్ తిరమలరావుకు వినతి పత్రం అందజేశారు. జీవో ప్రకారం విద్యార్హతల సర్టిఫికెట్లు, కుటుంబ సభ్యుల నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్, అఫిడవిట్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు ప్రభుత్వానికి అందించి 14 నెలలైందన్నారు. జీవో వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 265 మంది వీఆర్ఏలు మరణించారన్నారు. 14 నెలలుగా 20,555 మంది వీఆర్ఏలు చేయాల్సిన పనులను 3,797 మందిమే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

కారు బోల్తా: ఏడుగురికి గాయాలు

అందోల్, సెప్టెంబర్ 25: కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఆరుగురు టీచర్లతోపాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండలంలోని మసానిపల్లి శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అక్సాన్‌పల్లి, నేరడిగుంట ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వరలక్ష్మి, పూర్ణచందర్‌రావు, మధుసూదన్ రెడ్డి, ప్రవీణ, రత్నకుమారి కలిసి విధులకు హాజరయ్యేందుకు రోజూ ఓ ప్రైవేటు వాహనంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలోనే మసానిపల్లి గ్రామ శివారులోని 161 జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురు టీచర్లతోపాటు కారు డ్రైవర్ ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. వెంటనే జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు జోగిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింగూర్ బ్యాక్ వాటర్.. ఆందోళనలో రైతులు

చీకూరిలో పత్తి చేనులోకి చేరిన నీరు

జహీరాబాద్, సెప్టెంబర్ 25: మండలం పరిధిలోని మంజీర నది తీరంలోని కాకిజనవాడ, రాఘవపూర్, చీకూర్తి, హుస్సేన్‌నగర్, చాల్కి, అమీరాబాద్ తదితర గ్రామాల్లో సాగులో ఉన్న పంట పొలాల్లోకి సింగూర్ బ్యాక్ వాటర్ చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా కురుసున్న భారీ వర్షాలతోపాటు ఎగువ నుంచి వస్తున్న వరద నీరు మంజీర నదిలోకి భారీగా చేరుకుంటున్నదన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో సోయాబీన్, పత్తి తదితర పంటలు దెబ్బతిని తీరని నష్టం వాటిల్లనున్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాన్నా రు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని సింగూర్ బ్యాక్ వాటర్‌లో పంటలు మునగకుండా చూడాలని కోరుతున్నారు.

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

విద్యార్థుల ఎగ్జిబిట్స్‌ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 25: నేటి బాలలే భావిభారత శాస్త్రవేత్తలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని ఎల్ఐజీ విద్యాభారతి హైస్కూల్‌లో సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరై ప్రారంభించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ని పరిశీలించారు. విద్యార్థుల పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభారతీ స్కూల్‌లో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సైన్స్ ఫెయిర్లు విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అవధానులు, కార్యదర్శులు శ్రీనివాసరావు, గాల్‌రెడ్డి, సహకార్యదర్శి భూపాల్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు, సభ్యులు సత్తయ్య, రాజానందం, భీమ్‌రావు, కృష్ణాగౌడ్, లక్ష్మణ్, నాయకులు బూరుగడ్డ నగేశ్, ప్రిన్సిపాల్ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పర్యాటక దినోత్సవం

విద్యార్థులతో అధ్యాపకులు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 25: భారతదేశ సాంస్కృతిక సంపద ప్రపంచానికే ఆదర్శమని స్థానిక తారా ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కళాశాలలో యువ టూరిజం క్లబ్, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి డాక్టర్ వాణి, యువ టూరిజం క్లబ్ కన్వీనర్ డాక్టర్ సదయ్యకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వాణి, డాక్టర్ జోత్స్న, డాక్టర్ సుమతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లిక పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి ఆటో డ్రైవర్ మృతి

పటేల్‌విఠల్‌గౌడ్ (ఫైల్)

హత్నూర, సెప్టెంబర్ 25: చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటన హత్నూర మండలం మల్కాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పటేల్‌విఠల్‌గౌడ్(29) ఈనెల 17న దౌల్తాబాద్ నుంచి మల్కాపూర్‌కు ప్రయాణికులతో వెళ్తుండగా మార్గమధ్యలో ఆర్టీసీ బస్సు డ్రైవర్, ఆటోడ్రైవర్‌కు సైడ్ ఇవ్వడంలో వాగ్వాదం జరిగి పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. అక్కడ బస్సు డ్రైవర్ ఆటోడ్రైవర్ విఠల్‌గౌడ్‌పై ఫిర్యాదు చేస్తుండగా విఠల్‌గౌడ్ ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న విఠల్ గౌడ్ బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఝరాసంగం, సెప్టెంబర్ 25 : మండల పరిధిలోని 33 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 14వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. 2023–24 సెప్టెంబర్ వరకు ఉపాధి కూలీలకు వేతనాల రూపంలో రూ.8కోట్ల 23లక్షల 4వేల 32 చెల్లించగా మెటీరియల్ కింద రూ.19లక్షల 41వేల 485 ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు. బీఆర్పీలు, వీఎస్ఏలు గ్రామాల్లో 15 రోజులుగా పనులను తనిఖీ చేశారు. మాచనూర్ గ్రామానికి చెందిన రైతు ఉపాధి పథకం ద్వారా మామిడి మొక్కలు నాటుకున్నానని, సంవత్సరం నుంచి ఈసీ రికార్డు చేయకుండా బిల్లులు చెల్లించక తిప్పుతున్నాడని అధికారుల దృష్టికి తీసుకువచ్చాడు. ఏపీడీ బాలరాజ్ స్పందిస్తూ రికార్డు చేసి వారం రోజుల్లో బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఈసీని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు మస్టర్‌లో సంతకాలు పెట్టడం లేదని చెప్పగా బాధ్యత లేదా అంటూ ప్రశ్నించారు. రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలని, పనుల్లో తేడాలు కనిపించకుండా సవరించుకోవాలని సూచించారు. ఎంపీడీవో సుధాకార్, రాష్ట్ర క్వాలిటీ అధికారిని శ్రీలత, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, జిల్లాక్వాలిటీ అధికారి సుభాష్, విజిలెన్స్ అధికారి నాగేశ్వరావు, ఏపీవో రాజ్‌కుమార్, డీఆర్పీ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

హత్నూర, సెప్టెంబర్ 25: గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి స్వప్న అన్నారు. బుధవారం హత్నూరలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. పారిశుధ్యం, పచ్చదనం, వ్యాధుల నివారణ, విద్యుత్ సమస్యల పరిష్కారంచ, తదితర ఆంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి రమేశ్

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 25: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ భవాని చంద్ర సూచనల మేరకు బుధవారం సంగారెడ్డి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్జి రమేశ్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ క్రమ శిక్షణగా ఉండాలని, న్యాయ వ్యవస్థతె ఎలా మెలగాలో దిశా నిర్దేశం చేశారు. గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోస్కో, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. అంతకు ముందు కళాశాలను తనిఖీ చేసి విద్యార్థినుల బాగోగులపై ఆరా తీశారు.

బొంతపల్లిలో రైతులకు చెక్కుల పంపిణీ

బొంతపల్లిలో రైతులకు చెక్కులు అందజేస్తున్న కాలుష్య రహిత కమిటీ సభ్యులు, నాయకులు

గుమ్మడిదల, సెప్టెంబర్ 25: బొంతపల్లి పారిశ్రామికవాడలో రసాయన పరిశ్రమల కారణంగా పంటలు వేయడానికి పనికిరాకుండా పోయిన రైతుల పంట పొలాలకు రైతు కాలుష్య రహిత కమిటీ సభ్యులు నష్ట పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన 393 మంది రైతులకు సుమారు రూ.43 లక్షల విలువచేసే చెక్కులను పంపిణీ చేశారు. ఎకరాకు రూ.12,500, అర్ధ ఎకరానికి రూ.5 వేలు, పాక్షికంగా నష్టపోయిన రైతులకు రూ.2 వేల చొప్పున చెక్కులు పంపిణీ చేసినట్లు కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, మాజీ సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సురభి నాగేందర్ గౌడ్, పొన్నబోయిన వేణు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ దేవబోయిన కుమార్, నాయకులు మడపతి గణేశ్, లక్ష్మీనారాయణ, గ్యారల మల్లేశ్, సుంకరి శంకర్, వినోద్‌గౌడ్, ముద్దంగుల గోపాల్, నల్ల మహేశ్, కావలి శంకర్‌యాదవ్, నగేశ్, శ్రీను, సహదేవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

రాయికోడ్, సెప్టెంబర్ 25: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా ఇతర పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు యాదవులు కోరారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రమైన జిల్లా పరిషత్ పాఠశాలలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం జీవో 25ను సవరించి బదిలీ అయినా రిలీవ్ కానీ ఉపాధ్యాయులను వారి కొత్త స్థానానికి పంపించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు అబ్బుల్‌కలాం, ప్రశాంత్, నాగభూషణం, రహూఫ్, అరుణజ్యోతి, అనిత ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు దసరా బోనస్ ఇవ్వాలి

సదాశివపేట, సెప్టెంబర్ 25: కాంట్రాక్ట్, క్యాజువల్ కార్మికులకు వెంటనే దసరా బోనస్ ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, సీహెచ్ మహేశ్, వరప్రసాద్, నీలం మల్లేశం, నాగరాజు, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, విజయ్‌చందర్, భాస్కర్, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జనజాగృతి సేన అధ్యక్షుడు కృష్ణ

సంగారెడ్డి, సెప్టెంబర్ 25: కొత్తగా పెండ్లి చేసుకున్న జంటలకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ దేవీదాస్‌కు జనజాగృతి సేన ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. బుధవారం పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరై నెలలు గడుస్తున్నా పంపిణీ చేయకపోవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. 180 మంది లబ్ధిదారులు రోజూ తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోతున్నారన్నారు. ఇప్పటికైనా చెక్కులు పంపిణీ చేయాలని కోరారు. చింతల సాయికుమార్, అబ్దుల్ ఖలీం ఉన్నారు.

సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద

పుల్కల్,సెప్టెంబర్ 25: సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టుకు బుధవారం 10431 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి వరద వస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. 2818 క్యూసెక్కుల నీటితో విద్యుదుత్పత్తి చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 29.768 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఔట్‌ఫ్లో 11461 క్యూసెక్కుల వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.

గుమ్మడిదలలో దంచికొట్టిన వాన

గుమ్మడిదల, సెప్టెంబర్ 25: మండల కేంద్రంలో వానదంచి కొట్టింది. బుధవారం గుమ్మడిదల మండల కేంద్రంతోపాటు బొంతపల్లి, దోమడుగు, వీరన్నగూడెం తదితర గ్రామాల్లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బొంతపల్లిలో మోకాలు లోతు వరదతో రసాయన వ్యర్థజాలాలు వాననీటితో సమీప చెరువుల్లో కలిశాయి. ఎప్పుడు వాన వస్తే అప్పుడు రసాయన పరిశ్రమలు ఇష్టానుసారంగా వ్యర్థ జలాలను వదులుతుండడంతో చెరువులు, కుంటలు కలుషితం అవుతున్నాయని వాపోతున్నారు. పీసీబీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కారణానికి గురైన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పోలీస్ యాక్ట్‌పై అవగాహన కల్పించాలి

ఎస్ఐ నారాయణ ముదిరాజ్‌కు సన్మానిస్తున్న నాయకులు

రాయికోడ్, సెప్టెంబర్ 25: నూతన పోలీస్ యాక్ట్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు తమ్మలి రాజు ముదిరాజ్ కోరారు. బుధవారం రాయికోడ్ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ నారాయణ ముదిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో చట్టాలపై అవగాహన లేకపోవడంతో క్షణికావేశంలో కొందరు తప్పుదోవ పడుతున్నారన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చట్టాలపై అవగహన కల్పించాలన్నారు. నాయకులు నావిన్‌కుమార్, గోపాల్ ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

జహీరాబాద్, సెప్టెంబర్ 25: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జహీరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అంజమ్మ అన్నారు. బుధవారం న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ రైతు వేదికలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మహిళలు యుక్త వయస్సు నుంచే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, పవన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గుమ్మడిదల, సెప్టెంబర్ 25: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న యువకుడికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయమందించారు. కొంత కాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో మల్లారెడ్డి దవాఖానలో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన బొడ్డు రమేశ్‌కు బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి రూ.20 వేలు అందించారు.

ఐటీఐలో వాక్ఇన్ అడ్మిషన్లు

హత్నూర, సెప్టెంబర్ 25: హత్నూర ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో కోపా, వెల్డర్, మేషినిస్ట్–కాంపోసైట్ ట్రేడ్లలో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 28లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లను https://iti.telangaana.gov.inలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వాక్ఇన్ అడ్మిషన్లకు ఈనెల 25 నుంచి 28 వరకు రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఈ నెల 30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 25: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఎగ్జామినేషన్ (ఎన్ఎంఎంఎస్ఈ) ఫీజును ఈ నెల 30లోగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు అవకాశం ఉన్నదని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆయా దరఖాస్తులను అక్టోబర్ 1లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు http://bse.telan agana.gov.in లో పొందవచ్చన్నారు. ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు గుర్తించాలని కోరారు.

29న కరాటే పోటీలు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 25: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి కరాటే పోటీలు సదాశివపేటలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సీహెచ్ అమూల్యమ్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగంలో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. క్రీడాకారులు బోనాఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు పీడీ సత్యనారాయణను(99892 18299, 98485 79970) సంప్రదించాలన్నారు.

నేడు యోగా శిక్షకులకు ఇంటర్వ్యూ

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 25: ప్రజల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్స్‌ను రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్నందున, కాంటాక్టు పద్ధతిలో యోగా శిక్షకులను నియమిస్తున్నట్టు ఆయుష్ సీనియర్ మెడికల్ అధికారి నర్మదా బుధవారం ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్‌లో ఈ నెల 26న ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో 15 మంది చొప్పున పురుషులు, మహిళా శిక్షకులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. వివరాలకు http://ayush.telanagana.gov.inలో సంప్రదించాలని కోరారు.